


# “నేను నీ పాపనే!”

కథానిక

డి. వాణి

“అక్కా! ఆ పాప ఎవరే?” అంది విమల కాలేజీనుంచి వస్తూ, హాల్లో కూర్చున్న జయ ఒడిలోవున్న పాపని చూసి.

“ఎవరేమిటి? మన పాప” అంది జయ.

“సరేలే, చెబుదూ” అంది విమల. ఇంతలో జయ భర్త ప్రకాశరావు వచ్చాడు. “ఏమిటి విమలా, అంతగా బ్రతిమాలుతున్నావు” అన్నాడు.

“ఏమీలేదు బావా, ఆ పాప ఎవరో అని” అంది.

“అవునవును ఎవరు జయా?” అన్నాడు.

“అంతగా అడుగుతారేమిటి, మన పాపేనండీ” అంది జయ.

ఇంతలో ప్రకాశరావు కాళ్లు కడుక్కొనివచ్చాడు. జయ, ముగ్గురికీ కాఫీ, టిఫిన్ తెచ్చి ఇచ్చింది. ముగ్గురూ తింటున్నారు. జయ ఒడిలోవున్న పాప ఏడ్చింది. వెంటనే జయ తినే టిఫిన్ వదిలిపెట్టి పాపకి పాలుపడుతూకూర్చుంది.

విమల నవ్వుతూ, “బావా, చూశావా? మరి అక్కకి పాపమీద ఎంత ప్రేమో? మంచి పాపనే సంపాదించిందిలే” అంది. ప్రకాశరావు కూడా హేళనగా నవ్వాడు. కాని జయ లెక్కించలేదు.

“పోనీ, అక్కయ్యా పేరైనా చెబుదూ”

“సుధ” అంది జయ. “మంచిపేరే, ఐతే సినిమా ప్రోగ్రాం ఏమైంది?” అంది విమల. “వెళదాం” అన్నాడు ప్రకాశరావు.

వెంటనే జయ పాపకి టాయిలెట్ చేసి పాపనెత్తుకొని తను కూడా బయల్దేరింది.

“ఇంతకీ ఎవరా పాప జయా” అన్నాడు.

“చెప్తానుగా” అంది జయ. ముగ్గురూ సరదాగా వెళ్ళారు.

* * *

జయ, విమల అక్కచెల్లెళ్లు. ఇద్దరూ మంచి అందగత్తెలు. మంచి బుద్ధిమంతులు. కాని దురదృష్ట వశాత్తూ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినారు. కాని మేనమామ వీళ్ళకు వచ్చిన ఆస్తి జాగ్రత్తగా కాపాడుతూ చదివించాడు. జయ మద్రాసులో బి. ఏ. చదువుతూవుండగా, అక్కడే ప్రకాశరావు ఎం. ఏ. చదివేవాడు. జయ అంద చందాలు, గుణాలు, తెలివీ చూచి పెళ్ళిచేసుకున్నాడు. ఇద్దరూ మద్రాసులోనే కాపురం పెట్టారు. ప్రకాశరావు కాలేజీ లెక్చరర్. విమల, అక్కదగ్గిరే వుండి ఇంటరు చదువుతూంది. సంసారం ఆనందంగా సాగుతూంది.

జయ, వాళ్ళ యింటి ప్రక్కన గుమాస్తా కామేశ్వరరావుగారుండేవారు. ఆయన భార్య లక్ష్మి. చాలీచాలని జీతంతో, ఆ మహానగరంలో ఎలాగో గడిపేవారు. వాళ్ళ స్థితి గమనించిన జయ వాళ్ళకి సాయంచేసేది. జయది చాలా జాలిగుండె.

కొన్నాళ్లలయిన తర్వాత లక్ష్మి గర్భవతి అయి కూతుర్ని ప్రసవించింది. భార్యాభర్తలు బిడ్డను ముద్దుగా చూస్తూ “సుధ” అని పిలిచేవారు పాపకి ఎనిమిదో నెల వచ్చింది. అప్పుడు ఒకనాడు కామేశ్వరరావు ఆఫీసునించి వస్తూ కారుక్రిందపడి ప్రమాదవశాత్తూ మరణించాడు.

ఇంక లక్ష్మికి దిక్కే లేకపోయింది. ఆ స్థితిలో జయ ఆదుకొంది. లక్ష్మిని ఎన్నోవిధాలుగా వోదార్చింది. కాని లక్ష్మి భర్త్రృవియోగంవలన మితిలేని బాధ ననుభవించి శాశ్వత విశ్రాంతి తీసుకొంది. పోయే ముందు జయకి పాపని ఒప్ప జెప్పింది. జయ చాలా బాధపడింది. కాని పాప కేమీ భయంలేదని చెప్పింది.

* * *

ఆ పాపే యీ పాప విమలకుగాని, ప్రకాశ రావుకుగాని యీ అంతర్యాలు తెలియవు. తరువాత జయ సెన్నోవిధాలుగా అడగ్గా చెప్పింది. విమల విసేసి వూరుకొంది. కాని ప్రకాశరావు కీవిషయం నచ్చలేదు. దిక్కులేని పిల్లని తెచ్చి పెంచుకోవటమేం? తమకి పిల్లలు లేరనుకొందికి వయస్సు మళ్ళలేదే? అని ఎన్నోవిధాలుగా అను కున్నాడు. జయ, పాపని అంత ప్రాణప్రదంగా చూడటం అతని కర్థంకాలేదు. ఆఖిరికి జయతో, "జయా, పాపని ఏ శరణాలయానికో యిచ్చే ద్దాం. ఎవరికైనా తెలుస్తే బాగుండదు" అన్నాడు.

"అదేమిటండీ, అలా అంటారేం? ఈ పాప మన పాపకాదని ఎవరైనా అనగలరా? ఆ పాడు పని చెయ్యలేను సుమండీ" అంది. ఆ మాటతో ప్రకాశరావుకి కొంచెం కోపం వచ్చింది. కాని ఎన్నోవిధాలుగా చెప్పాడు. కాని జయ, "మన పాపే" అని పాపను హృదయాని కదుముకొంది. పాప కిలకిలా నవ్వింది.

ప్రకాశరావుకి చాలా కోపంవచ్చింది."జయా" అని ఫెళ్లున ఒక్కచెంపకాయ కొట్టాడు విచక్షణ లేకుండా. పాపను హృదయాని కదుముకుంటూ జయ మంచంమీద పడిపోయింది. ప్రకాశరావు వెంటనే బైటికి వెళ్ళిపోయాడు.

కొంతసేపటికి విమల సేవవలన జయకి తెలివి వచ్చింది. పాపను క్షేమంగా వుంచడానికి అక్కడినుంచి పోతేనే మంచి దనుకొంది. ఆ క్షణంలో అంతకంటే ఆలోచించ లేకపోయింది. వెంటనే ప్రకాశరావు కీవిధంగా రాసింది.

"ప్రకాశరావుగారికి,

నేను పాపను వదిలియుండలేను. నాకు పాపకి ఏదో తెలియని బాంధవ్యం వుంది, పాప మనపాపఅని మీరన్నప్పుడే మనం కలుసుకోవచ్చు.

జయ"

విమల ఎంతో బ్రతిమాలింది. ఎన్నోవిధాల చెప్పింది. కాని, విమలని తోసేసి, "విమలా దైవ కృపవుంటే కలుసుకోవచ్చు. నీవు బావను..." అని మరి మాట్లాడలేక పాపను హృదయాని కదుముకొని చీకటిని చీల్చుకుంటూ వెళ్ళిపోయింది. విమల కన్నీళ్ళతో కుర్చీలో కూలబడింది.

రాత్రి పదకొండు గంటలకి ప్రకాశరావు వచ్చాడు. విమల వుత్తరం యిచ్చింది. చదివి అలా వుండిపోయాడు. జయ ఇంతపని చేస్తుం దనుకోలేదు. తరువాత తెప్పరిల్లి వెంటనే నగ రంలో తనకు తెలిసినంతవరకు తిరిగి వెదికాడు. ప్రయోజనం శూన్యమైంది. నిస్పృహతో, నిరా శతో ఇంటికొచ్చాడు. పత్రికలద్వారా చూచారు, కాని లాభం లేకపోయింది.

జయ వెంటనే స్టేషన్‌కి వెళ్ళిపోయింది. కలకత్తాహాస్పిటల్‌ల్లో డాక్టరుగావున్న స్నేహితు రాలు శారద దగ్గిరికి వెళ్ళడానికి నిశ్చయించి కలకత్తా టిక్కట్టు కొనుక్కొని మెయిలెక్కింది. శారద జయరాకచూచి చాల ఆశ్చర్యపడింది. పాపనిచూచి "ఈ పాప ఎవరు?" అనిఅడిగింది. జయబాధగా, "శారదా నీవుకూడ అడేద్రశ్నా? పాపనాదే" అంది. శారద జయబాధ అర్థంచేసు కొని మరల అడగలేదు. జయస్కూల్లో టీచరుగా చేరింది. ఇద్దరూ పాపను ముద్దుగా చూసుకొనే వారు. ఒక్కొక్కసారి జయకి తను చేసినపనికి బాధకలిగినా త్యాగంచేస్తున్నాననుకొని తృప్తి చెందేది. ఇరవై సంవత్సరాల ప్రాయంలోనే యింతపరోపకారబుద్ధి, పిల్లల మమకారం ఎలా కలిగాయా అని శారద ఆశ్చర్యపడేది.

* * *

కాలవాహినిలో పన్నెండు సంవత్సరాలు కొట్టుకుపోయాయి. ప్రకాశరావు ఎన్నివిధాల ప్రయత్నించినా జయజాడ తెలియలేదు. ఆఖరికి ఇంక వుండలేక విమలను పెళ్ళిచేసుకున్నాడు. విమలకు ముగ్గురు బిడ్డలు కలిగారు. కాని భార్యా భర్తలిద్దరూ మనస్సులో ఏదో తప్పుచేసినట్లు బాధ పడేవారు. ఏనాటికైనా జయరాదా? అని అను కొనేవారు. తాను అసందర్భంగా జయతో విరోధం

పెట్టుకొన్న విషయం తలచుకొని సిగ్గుపడేవాడు.

అక్కడ—క్రమంగా పాపపెద్దదైంది. జయ ఆధీనంలో, పెంపకంలో పాపకు మంచిబుద్ధి అలవాట్లూ వచ్చాయి. చాలాచురుకుగా, తెలివితేటలుగవుండేది. పచ్చని శరీరచ్ఛాయ, పెద్దకళ్లు, అందమైనముఖం కలిగి యుండేది. తరగతిలో ఫస్టుగచదువుతూ అందరిమన్ననలు పొందేది. జయను "అమ్మా"అని పిలచేది. ఆ పిలుపుతోజయ తన్మయురాలయేది. శారదకూడ చాలసార్లు పాపని వదిలిపెట్టమని చెప్పిందికాని జయ వినలేదు.

ఒకసారి డాక్టరు శారద పనిమీద మదరాసు వెళ్ళవలసి వచ్చింది. ఫలానాచోటికని జయతో చెప్పకుండా బయల్దేరి వెళ్ళింది. అక్కడ బీచిలో విమలను చూచింది. విమలనిదివరకు తెలిసివుండటం వలన గుర్తుపట్టింది. జయవిషయం చెప్పాలనుకొంది. ఎన్నాళ్ళీవిధంగా జయ వుండగలదు? హాయిగా సంసారం చేసుకోవలసిన కాలంలో ఎవరిపాపనో తనపాప అని వెర్రిగా యిల్లువిడిచి రావటం ఏమంత మెచ్చదగినది? ఇప్పటికే చాల ఆలస్యమైంది. ఇంక ఉపేక్ష చేయకూడదని శారద ఆలోచించి విమలను పిలచింది. చిరపరిచితురాలు కనపడడంతో విమల ఆశ్చర్యానందాలతోవచ్చి కుశలప్రశ్న వేసింది. జయసంగతిచెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకొంది. వెంటనే శారద వుండలేక జయ తనదగ్గర వుంటున్నట్లు చెప్పివేసింది మాటవిన్న విమల ఒక్కగంతేసి వెంటనే బయల్దేరదామని చెప్పింది. ప్రకాశరావునికూడ చాలబలవంతచేశారు కాని రాలేనన్నాడు. విమల పెద్దకొడుకు ఎనిమిదేళ్ళరఘుని తీసుకొని మిగతయిద్దరిని 'ఆయా' దగ్గర వదిలిపెట్టి శారదతో బయల్దేరింది.

శుక్రవారం బయలుదేరి ఆదివారం ఉదయం కలకత్తాచేరారు. జయ పాపకి జడవేస్తూంది. విమల ఒక్కసారిగా వెళ్ళి "అక్కా"అని జయను కౌగలించుకొంది. జయకిదేమీ బోధపడలేదు. కాని కన్నీళ్ళతో "విమలా"అంది. పాప, రఘు ఆశ్చర్యంతో నిలబడ్డారు. "అక్కా నన్నుక్షమించు. నేను బావను..."...అని తలవంచుకొంది. జయ సంతోషంతో "విమలా, నామాట విన్నావు. మంచిదానివి" అంది. విమల పాపను చాల ఆదరంతో పలుకరించి పాపతెలివితేటలు, అందం చూచి ఆశ్చర్యపడింది.

మర్నాడే విమల బలవంతంవల్ల అందరూ మద్రాసు వెళ్ళారు. జయ యింట్లో అడుగుపెట్టగానే ప్రకాశరావు వచ్చి జయ చేతులుపట్టుకొని "జయా, నన్ను క్షమించు" అన్నాడు. జయ నవ్వింది. ప్రక్కనేవున్న పాప ప్రకాశరావుకి నమస్కారంచేసింది. ప్రకాశరావు ఆనందంతో "మనపాపేజయా" అన్నాడు.

పాపకి యిదంతా ఆశ్చర్యంగా తోచింది. ఇదంతా ఏమిటని జయనడిగింది. జయ ఎన్నివిధాలతప్పింపజూసినా వినలేదు. ఆఖరికి చాటుగా విమలను ఒత్తిడిచేసింది. విమల దాచలేక అంతా చెప్పింది. పాప చాలబాధపడింది. తనవలన జయ సంసారాన్ని వదిలిపెట్టివచ్చిందని, యిన్నివిధాల అందరూ బాధపడవలసి వచ్చిందని మరీ బాధపడింది. ఆ రోజంతా మౌనంగానే ఎలాగో గడిపింది. ఆడుతూ పాడుతూవుండే పాప మౌనం చూచి జయ ఆశ్చర్యపడింది. అడిగినా పాప ఏమీలేదంది.

రాత్రిపదైంది. అంతాపడుకున్నారు. జయ పాపదగ్గరకి వెళ్లింది. పాప డాబామీద వెన్నెలలో గోడనానుకుని విచారంగానిలబడింది. జయ పాపదగ్గిరకెళ్లి "పాపా, అలావున్నావేం?"అంది.

"అమ్మా, నావల్ల నీవిన్ని బాధలు పడవలసి వచ్చిందని నాకు చాల బాధగావుంది. నీ జీవితం నావల్ల పాడుచేసుకున్నావు పారిపోయావు. నన్ను క్షమించు. ఇప్పుడైనా నేనెక్కడికైనా వెళ్లిపోతా వదిలిపెట్టెయ్యి"అంది పాప జయవైపు చూస్తూ. జయ, యింత చిన్న వయస్సులోనే ఇలా కష్టసుఖాలు తెలిసిన మనిషిలా మాట్లాడే పాపని చూసి ఆశ్చర్యపడింది. పాపనువదిలి తను వుండగలదా? వెంటనే పాపను హృదయానికి హత్తుకొని, "పాపా, నీవెప్పటికైనా నాపాపవే మనిద్దరికీ దగ్గర బాంధవ్యముంది. నీవలా అంటే నాకు కష్టంగా వుండదూ? ఇంకెప్పుడూ అలాఅనకు. ఏదీ ఒక్క నవ్వు"అంది.

పాపకామాటతో చాల ఆనందం కలిగింది.

"నేనునీపాపనే"అంటూ జయకళ్లలోకిచూస్తూ నవ్వింది. పాపకళ్ళలో జయ వేయిదీపాల వెలుగు చూస్తూ మరొకసారి హృదయానికదుముకొంది. ★